పది పరీక్షలు ప్రారంభం



చిలకలగూడ : పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల, వీరమాచినేని, శ్రీవిద్య, విజ్ఞానభారతి తదితర పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్నారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ అనుదీప్ నేతృత్వంతో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు నేతృత్వంలో ఠాణా పరిధిలోని చౌరస్తాల వద్ద ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా సిబ్బందిని నియమించి క్రమబద్ధీకరించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్ సిబ్బంది ఆల్ ది బెస్ట్ పోస్టర్లతో విద్యార్థులకు స్వాగతం పలికారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 176 మందికి అందరూ హాజరైనట్లు ప్రిన్సిపల్ మదన్ మోహన్ తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులు సైతం అందరూ సమయపాలన పాటించి పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రాలకు చేరుకున్నారని పరీక్ష సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండడంతో పరిసరాల్లో జిరాక్స్, సెంటర్లను మూసివేయించారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లితండ్రుల సందడి

అమీర్‌పేట మండలంలో..

సనత్‌నగర్: అమీర్‌పేట మండలంలో ఏర్పాటు చేసిన 10 కేంద్రాల్లో 1987 మంది విద్యార్థులకు 1984 మంది పరీక్షలు రాశారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి కస్టోడియన్ అధికారులు భద్రత నడుమ పేపర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సికింద్రాబాద్ మండల పరిధిలో 2861 విద్యార్థులకు ఆరుగురు గైర్హాజరయ్యారు

బౌద్ధనగర్ డివిజన్‌లో..

బౌద్ధనగర్: పదవ తరగతి పరీక్షల సందర్భంగా బౌద్ధనగర్ డివిజన్‌లోని పరీక్ష కేంద్రాల వద్ద సోమవారం విద్యార్థులు బారులు తీరారు. టెన్షన్ టెన్షన్ పడుతూ తల్లిదండ్రులు ఉదయాన్ని విద్యార్థులను సెంటర్ల వద్దకు తీసుకొచ్చారు. పలువురు తల్లిదండ్రులు పరీక్ష ముగిసే వరకు అక్కడే వేచి ఉన్నారు.



నంబర్లు సరి చూసుకుంటున్న విద్యార్థులు



ఆల్ ది బెస్ట్ చెబుతున్న ఏసీపీ శంకర్‌రాజు



ఉత్సాహంగా పరీక్షకు హాజరవుతున్న విద్యార్థినులు



విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు

నిబద్ధత గల అధ్యాపకులనే వీసీలుగా నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీలకు నిబద్ధత గల అధ్యాపకులనే వీసీలుగా నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పృథ్వీ తేజ ప్రభుత్వాన్ని కోరారు. గతంలో పైరవీలు, పలుకుబడి వారినే అధ్యాపకులను వీసీలుగా నియమించారని, ఇప్పుడు అలా కాకుండా నీతి నిజాయితీ గల వారిని నియమించాలన్నారు. పది సంవత్సరాలుగా నిధులు, నియామకాలు లేని వర్సిటీల బలోపేతానికి ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.

కష్టపడిన వారికి సముచిత స్థానం



ప్రీతంను సన్మానిస్తున్న రామలీల

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నగరి ప్రీతంను అడ్డగుట్టకు చెందిన కాంగ్రెస్ నాయకురాలు రామలీల నేతృత్వంలో పలువురు మహిళ కార్యకర్తలు కలిసి శాలువాతో సత్కరించారు. పార్టీ అభ్యున్నతి, ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వారందరికీ కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. అల్వాల్- బొల్లారం రైల్వే స్టేషన్ల మార్గమధ్యలోని పట్టాలపై ఈ నెల 18న సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

నేటి నుంచి సువార్త స్వస్థత సభలు



పాస్టర్ జాయ్

చిలకలగూడ: చిలకలగూడ హోసన్న పెంతెకోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ నేతృత్వంలో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు పాస్టర్ జాయ్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి 1 గంట, సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు కుటుంబ ఉపవాస ప్రార్థన, బైబిల్ స్టడీ, పరిశుద్ధాత్మ, శుద్ధీకరణ కూడిక, స్తుతి ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాస్టర్లు జెబ్‌రాజ్, మాథ్యూస్, జాన్ వెస్లీ, చార్లెస్ జాకబ్ ముఖ్య అతిథులుగా హాజరై సందేశాన్ని వినిపిస్తారన్నారు. పాస్టర్ డేవిడ్‌రాజ్, రెబకమ్మ దంపతులు సుమారు ఆరు దశాబ్దాల క్రితం హోసన్నా పెంతెకోస్తు మినిస్ట్రీస్ స్థాపించి విశ్వశాంతి కోసం అనేక సమావేశాలు, సభలు నిర్వహించారని, వారి ఆశయా సాధనకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.

గజ్జెల నాగేష్‌కు టికెట్ కేటాయించాలి



దేవాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఉద్యమకారులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికలను పురస్కరించుకుని ఉద్యమకారుడు గజ్జెల నాగేష్‌కు ఈ సారి టికెట్ కేటాయించాలని ఉద్యమకారుల ఐక్య వేదిక నాయకులు కోరారు. బొల్లారం తోట ముత్యాలమ్మ దేవాలయంలో సోమవారం గజ్జెల నాగేష్‌కు టికెట్ రావాలని పూజలు నిర్వహించారు. అనంతరం ఉద్యమకారులు ప్రభుగుప్తా, రంగా రవీందర్ గుప్తా మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండడమే కాకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాగేష్‌కు టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జంగాల మురళీ యాదవ్, అరుణ్ యాదవ్, రాజుసింగ్, సత్యనారాయణగౌడ్, రావుల సతీష్, దయామణి, మీనా భాస్కర్ పాల్గొన్నారు.

లష్కర్ జిల్లా ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే దానంకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

చిలకలగూడ : లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సికింద్రాబాద్ జిల్లా ఆవశ్యకత, ఏర్పాటు, జరిగే అభివృద్ధి, ప్రత్యేక నిధుల మంజూరు వంటి అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జిల్లా ఏర్పాటుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే దానం నాగేందర్ హామీ ఇచ్చారని సాధన సమితి అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, సాదం బాలరాజ్ యాదవ్ తెలిపారు.

మాదిగలకే టికెట్ కేటాయించాలి

రసూల్‌పురా: రాబోయే కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మాదిగలకే టికెట్ కేటాయించాలని వివిధ మాదిగ కుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం డైమాండ్ పాయింట్ వద్ద ఎమ్మార్పీఎస్, టీఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ ఇతర మాదిగ సంఘాల సభ్యులు శ్రీకిషన్ మాదిగ, గోపి, శర్వీన్, అజిత్ కళ్యాణ్ మాట్లాడారు. కంటోన్మెంట్ ఎస్సీ నియోజకవర్గంలో మాదిగ కులస్తులు ఎక్కువ ఉన్నారని మాదిగలపై ప్రధాన పార్టీలు వివక్షత చూపుతున్నారని యాభై ఏళ్లుగా ఏ ఒక్క పార్టీ మాదిగలకు టికెట్ కేటాయించలేదని అన్నారు. ఈ సారి కూడా మాదిగలకు టికెట్ కేటాయించని పక్షంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు తగిన విధంగా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మాదిగలంతా ఐక్యతగా ఉండి టికెట్ సాధించుకుందామని సూచించారు. త్వరలో మాదిగ కులసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మురళి మాదిగ, శివ మాదిగ, రొట్టేల శ్రీను మాదిగ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం సభ్యులు

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానంలోని శ్రీమదలర్మేల్ మంగా, పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం మంగళవాయిద్యం, గోష్ఠి, సుప్రభాతసేవ, నిత్య ఆరాధన సేవా కాలం, బాలభోగం, తీర్థ ప్రసాద వినియోగం, యాగశాల ప్రవేశం, సకల దేవతా ఆహ్వానం, ద్వార తోరణ పూజ, అగ్ని ప్రతిష్ఠ, మూల మంత్ర హవనములు, రాజభోగం, తీర్థగోష్ఠి, సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, మూల మంత్ర హోమములు, శ్రీవార్ల రాయబార మహోత్సవం, జరిగాయి.



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

నేడు దివ్య తిరు కల్యాణం..

మంగళవారం ఉదయం 9.30 గంటలకు సామూహికంగా దంపతులచే శ్రీవార్ల దివ్య తిరు కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఈఓ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధుల్లో స్వామివారి ఊరేగింపు జరుగుతుందన్నారు. అలాగే 20న ఉదయం 5 గంటలకు మంగళ వాయిద్యములు, 8 గంటలకు సుదర్శన నారసింహ హోమం, 21న ఉదయం 10 గంటలకు కొట్నాలు, అప్పగింతలు, వసంతోత్సవం, చక్రస్నానం ఉంటుందన్నారు.

చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించండి

సనత్‌నగర్: చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాలని సద్గురు డాక్టర్ సాయికుమార్ బాబాజీ సూచించారు. అమీర్‌పేటలో నీరజ్ పబ్లిక్ స్కూల్ నూతన భవనాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య సమాజ వికాసానికి దోహదం చేస్తుందన్నారు. దేశాభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, ప్రధాన ఆచార్యులు జివితేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగీతా రఘురామన్, పాఠశాల కమిటీ సభ్యులు గవీష్‌రెడ్డి, ఆర్జేదేబర్ ఎస్‌కే ఎం ఫిరోజ్‌షా భగత్, సుజాత కుమార్, సరితకుమార్ పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న సాయికుమార్

రైలెక్కుతుండగా కిందపడి విద్యార్థి మృతి

అడ్డగుట్ట: రైలు ఎక్కుతుండగా జారిపడి అపస్మారకస్థితిలోకి వెళ్లిన యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాలోని కొల్లూరుకు చెందిన నీలం సుమంత్(20) ఎల్.బి. నగర్‌లోని టీబీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 17న తన స్వగ్రామానికి వెళ్లేందుకు తన తమ్ముడు పోషక్‌తో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి జనరల్ టికెట్ తీసుకొని హైదరాబాద్ సైడ్ ఎండ్ వద్ద రైలు కోసం ఎదురుచూస్తున్నారు. స్టేషన్‌కు చేరుకున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేక్రమంలో నీలం సుమంత్ ప్రమాదవశాత్తు జారికింద పడ్డాడు. పోషక్ తోటి ప్రయాణికుల సహకారంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పట్టుదలతో చదివితే సివిల్స్ సాధ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: పట్టుదలతో చదివితే సివిల్ సర్వీస్ ఉద్యోగాలు సాధించవచ్చని 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణ ప్రదీప్ పేర్కొన్నారు. సోమవారం ఓయూ పరిధిలోని విద్యానగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పబ్లిక్ అడ్మిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరై కృష్ణప్రదీప్ ప్రసంగించారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులకు సివిల్స్ కోచింగ్‌లో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తిరుపతి, వెంకట ఈశ్వర్, కవిత, భారతి, అవినాష్‌రాజే, శ్రీదేవి, నర్సింగరావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 18, క్యారెట్ 21, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 19, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 45, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. చిలకలగూడ బస్టాప్ ప్రాంతంలోని మెట్రో పిల్లర్ నంబర్ సీ-1149 వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం మేరకు పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి 50-55 వయస్సు ఉంటుందని ఒంటిపై నీలం రంగు చొక్కా, ప్యాంటు ధరించి ఉన్నాడని మృతుడు యాచకుడై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గాంధీ మార్చురీకి తరలించారు.

రూ.2 పంపించుకుని రూ. 52 వేలు కొట్టేశాడు!

సనత్‌నగర్: తన సమస్యను జీహెచ్ఎంసీ దృష్టికి తీసుకువెళ్తామంటే సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి ఖాతా నుంచి నగదు మాయం చేసిన ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డీఐ జానకిరాములు ప్రకారం వివరాలు.. ఎస్సార్‌నగర్‌లోని ఓ భవనం ఐదో అంతస్తులో ఉంటున్న వెంకట రంగనాథ్ చావా తన ఇంటి పక్కనే ఉన్న ఓ హోటల్‌కు సంబంధించి పొగ గొట్టం (చిమ్నీ) రావడంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ దృష్టికి తీసుకెళ్లాలని టోల్‌ఫ్రీ నెంబర్ కోసం గూగుల్ వెతికాడు. జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నెంబర్‌గా భావించి ఆ నంబర్‌కు ఫోన్ చేసి తన సమస్యను చెప్పాడు. ఫిర్యాదు నమోదు చేయాలంటే రూ.2 ఫీజు చెల్లించాలని చెప్పడంతో అతను సూచించిన గూగుల్ పే నెంబర్‌కు చెల్లించాడు. కాసేపటి తర్వాత రంగనాథ్ చావా ఖాతా నుంచి మూడు దఫాలుగా రూ.52 వేలు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నామినేటెడ్ పదవుల్లో ఎంబీసీలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ అభ్యర్థుల జాబితాల్లో ఎంబీసీ లేరని (మోస్ట్ బ్యాక్‌వార్డ్ క్లాసెస్) ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు కంచర్ల బద్రి, పూసల రమేష్ సీఎం ప్రశ్నించారు. అన్ని రంగాలలో వెనుకబడి 30 శాతం జనాభా గల ఎంబీసీలకు ఒక్క నామినేటెడ్ పదవీ కూడా ఇవ్వక పోవడం దారుణమన్నారు. 37 నామినేటెడ్ పదవుల్లో అధికంగా అగ్రకుల నాయకులనే నియమించారని ప్రభుత్వం మరోసారి పునరాలోచించి అన్ని కులాల వారికి సమానంగా పదవులు ఇవ్వాలని కోరారు.

మద్యంమత్తులో యువకుల వీరంగం

బీరుబాటిళ్లతో దాడి, వ్యక్తికి గాయాలు

చిలకలగూడ : మద్యంమత్తులో యువకులు వీరంగం సృష్టించిన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీతాఫల్‌మండి మేడిబావిబస్తీలోని ఓ భవనం రెండో అంతస్తులో మహిళ, ఐదుగురు యువకులు గత కొంతకాలంగా అద్దెకు ఉంటున్నారు. ప్రతిరోజు పూటుగా మద్యం తాగి బస్తీలో హంగామా చేస్తుంటారు. ఈక్రమంలో ఆదివారం రాత్రి మద్యంమత్తులో యువకుల మధ్య వాగ్వాదం జరిగి, ఒకరిపై ఒకరు గట్టిగా కేకలు వేసుకుంటు వీరంగం సృష్టించారు. పరిసర ప్రాంత నివాసితులు, బస్తీవాసులు యువకులను నిలదీశారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్నవారు ఖాళీ బీరుసీసాలతో రెండో అంతస్తు నుంచి కిందికి విసురుతూ దాడులకు పాల్పడ్డారు. మరో యువకుడు కత్తితో బెదిరించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దాడిలో అదే ప్రాంతానికి చెందిన నర్సింగరావు తలకు బీరుసీసా తగిలి తీవ్ర రక్తగాయమైంది. డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ప్రధాన నిందితుడు నిఖిల్ ఫ్రాన్సిస్(20)ను అదుపులోకి తీసుకోగా, మహిళతో పాటు మరో నలుగురు పరార్ అయ్యారు. సదరు యువకులు పలు కేసుల్లో నిందితులని, ప్రతిరోజు గంజాయి, మద్యం సేవించి బస్తీలో వీరంగం సృష్టిస్తుంటారని స్థానికులు తెలిపారు. బాధితుడు నర్సింగరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని అడ్మిన్ ఎస్ఐ బాలరాజు తెలిపారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ అనుదీప్‌లు సోమవారం ఉదయం మేడిబావి బస్తీవాసులను కలిసి జరిగిన ఘటనపై ఆరా తీశారు. బీరుసీసాలతో దాడులకు పాల్పడుతున్న దృశ్యాలను కొంతమంది వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యాయి.



పై నుంచి బీరుబాటిళ్లు విసురుతున్న యువకులు (వృత్తంలో)

జూట్ బ్యాగుల పంపిణీ

బన్సీలాల్‌పేట్: పర్యావరణ పరిరక్షణ కోసం మోండా మార్కెట్‌లో సోమవారం కార్పొరేటర్ కొంతం దీపికా జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ నెల 19 (మంగళవారం) నుంచి మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లను వాడరాదని జీహెచ్ఎంసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 18 వరకు వ్యాపారులకు సమయం ఇచ్చారు. ఇప్పటికే వ్యాపారస్తులకు ప్లాస్టిక్ వాడకంపై పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్న విషయాన్ని వివరిస్తూ కరపత్రాలను కూడా పంపిణీ చేశారు. డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, శానిటేషన్ అధికారులు, సిబ్బంది మార్కెట్‌లో విస్తతంగా పర్యటించి ప్రచారం చేపట్టారు. దీనికి మద్దతుగా కార్పొరేటర్ కొంతం దీపికా మోండా మార్కెట్‌లో బ్యాగులను పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.



బ్యాగులు పంపిణీ చేసిన కార్పొరేటర్ కొంతం దీపికా

పార్క్ చేసిన ద్విచక్రవాహనం చోరీ

సనత్‌నగర్: సర్వీస్ సెంటర్ ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ జానకిరాములు వివరాల ప్రకారం.. బల్కంపేట రోడ్డులోని విశాల్ ఆటో మొబైల్స్, సర్వీస్ సెంటర్‌కు ఓ మహిళ తన టీవీఎస్ జూపిటర్ సర్వీస్ చేసేందుకు ఇచ్చింది. వాహనం సర్వీస్ చేసిన అనంతరం సర్వీస్ సెంటర్ ముందు నిలిపారు. సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి మాస్క్ ధరించి ఆటోమొబైల్స్ దుకాణంలోకి ప్రవేశించాడు. విడిభాగాల కోసం అడిగి తిరిగి వెళ్తూ సర్వీస్ సెంటర్ ముందు నిలిపి ఉంచిన టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని తీసుకుని ఉడాయించాడు. సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు ఫెర్నాండెజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

వ్యక్తి అదృశ్యం



కొండల్‌రావు

అడ్డగుట్ట: మతిస్థిమితం సరిగాలేని వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుగూడలోని రైల్వే క్వార్టర్స్‌కు చెందిన చింతల కొండల్ రావు(33) మతిస్థిమితం సరిగాలేదు. ఈ నెల 15న ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన కొండల్ రావు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికి, తెలిసిన వారిని వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.